క్లుప్తంగా

సామాజిక తనిఖీపై శిక్షణ



పాఠశాలల సామాజిక తనిఖీపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్

పూసపాటిరేగ: మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల సామాజిక తనిఖీపై ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి రమణమూర్తి మాట్లాడుతూ, పాఠశాలల్లో సామాజిక తనిఖీ చేయు విధానంపై సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలల హక్కులు, విద్యాహక్కు చట్టం, సమగ్రశిక్ష అమలు పరుస్తున్న వివిధ పథకాలపై ఉపాధ్యాయులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ రాజేష్, డి.శ్రీనివాసురావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ

● ఆర్‌జేడీ చిన్మయిదేవి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ పెంచాలని ఆర్‌జేడీ చిన్మయిదేవి ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. స్థానిక మహిళా ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కేంద్రాల పనితీరును పరిశీలించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. సమావేశంలో పీడీ శాంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఓపికగా సమాధానాలు చెప్పాలి

● శైక్షణిక్ ప్రముఖ్ ఎస్‌వీఎన్ సీహెచ్ శర్మ



శిశువిహార్ సమారోప్ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

విజయనగరం టౌన్: చిన్నారులు ప్రదర్శించిన కృత్యాలు చదువులో భాగమని, వాటి ద్వారా వ్యక్తిత్వ వికాసం, బుద్ధి వికాసం జరుగుతాయని విజ్ఞానభారతి హైస్కూల్ శైక్షణిక్ ప్రముఖ్ ఎస్‌వీఎన్ సీహెచ్ శర్మ అన్నారు. మహారాణిపేటలో బుధవారం జరిగిన శిశువిహార్ సమారోప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పిల్లలు అడిగే ప్రశ్నలకు తల్లిదండ్రులు ఓపికగా సమాధానం చెప్పాలని సూచించారు. విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులే మొదటి కారకులని.. పాఠశాల వారి బంగారు భవిష్యత్‌కు సరైన బాటలు వేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త వనజ, ప్రధానాచార్యులు విమల, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



బంగారమ్మతల్లి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

డెంకాడ: మండలంలోని సింగవరంలో నూతనంగా నిర్మించిన బంగారమ్మ ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలను బుధవారం ఊరేగించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మూడు రోజులు జరుగుతాయని గ్రామపెద్దలు తెలిపారు. గురువారం చండీయాగం, 28న విగ్రహాల ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటాయన్నారు.

సేవలు విస్తృతం..



సచివాలయ కార్యదర్శులతో సమావేశమైన నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: సచివాలయ ఔన్నత్యాన్ని మరింతగా మెరుగుపరిచి ప్రజాసేవలను విస్తృతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు ఆదేశించారు. మజ్జిపేటలోని 43వ నంబర్ సచివాలయంలో 42 నుంచి 49 సచివాలయాలకు సంబంధించిన కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రికార్డుల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అమలులో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. ఏసీపీ మధుసూదనరావు, టీపీఆర్ఓ సింహాచలం, కార్యదర్శులు పాల్గొన్నారు.

దివాకర్ మృతి పార్టీకి తీరని లోటు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు పక్కి దివాకర్ మృతి తీరని లోటని ఆ పార్టీ నాయకుడు గౌరీశంకరరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి దివాకర్ ఎంతో కృషి చేశారన్నారు.

అర్హులందరికీ ఇళ్లు



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

● జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. నెల్లిమర్ల మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహనిర్మాణం, నీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, నెల్లిమర్ల మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. అర్హత ఉన్నవారందరికీ ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని, బిల్లులు వెంటవెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. గృహనిర్మాణానికి ఇచ్చే 90 రోజుల వేతన మొత్తాన్ని త్వరగా మంజూ రు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ పనులను త్వరగా పూర్తి చేసి, ఇంటింటికీ కుళాయిలు మంజూరు చేయాలన్నారు. జగనన్న కాలనీలకు, ఇళ్లకు త్వరితగతిన విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడంతో పాటు అవసరమైన చోట కొత్తగా విద్యుత్ స్తంభాలను వేయాలని సూచించా రు. సమావేశంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బా బు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయు డు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదుల సన్యాసిరావు, జెడ్పీ సీఈఓ ఎం.అశోక్‌కుమా ర్, హౌసింగ్ పీడీ ఎస్‌వీ రమణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, డీపీఓ శ్రీధరరాజా, పీఆర్ ఎస్ఈ గుప్త, విద్యు త్ శాఖాధికారులు, ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ రమణరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి మహా సంప్రోక్షణకు ఎమ్మెల్సీకి ఆహ్వానం



ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుకు అప్పన్న స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న నిర్వాహకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిదలో ఉన్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబును విశాఖపట్నం రుషికొండ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ ఆధ్వర్యంలో సీతంపేటలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మే 4న నిర్వహించబోయే శ్రీవారి మహా సంప్రోక్షణ ఘట్టానికి హాజరుకావాలని ఆహ్వానపత్రం అందజేశారు. అనంతరం సింహాద్రి అప్పన్నస్వామి చిత్రపటాన్ని ఎమ్మెల్సీకి బహూకరించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థాన పాలక మండలి సభ్యుడు అప్పలనాయుడు, రుషికొండ వేంకటేశ్వరస్వామి దేవాలయ పర్యవేక్షకుడు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన కార్డియాలజీ సేవలు

● తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎం.డి తిరుమల ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: రోగులకు మెరుగైన కార్డియాలజీ సేవలు అందిస్తున్నామని తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎం.డి డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ అన్నారు. ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగం ఏర్పాటై 11 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు 3,200 యాంజిగ్రామ్.. 260 వాల్ రీప్లేస్‌మెంట్.. 900 వరకు బైపాస్ సర్జరీలు చేశామని తెలిపారు. గతంలో గుండె శస్త్రచికిత్సలు కోసం హైదరాబాద్, చైన్నై, బెంగుళూరు వంటి ప్రాంతాలకు వెళ్లేవారని.. అక్కడ లభించే సేవలన్నీ ఇప్పుడు విజయనగరంలో అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గుండె శస్త్రచికిత్సలకు లైవ్ డోనర్స్‌ను అందించిన సామాజిక కార్యకర్త అబ్దుల్ రవూఫ్‌ను సన్మానించారు.
కార్యక్రమంలో వైద్యులు కరుణాకర్ పాడే, వి.వాసుబాబు, దుర్గాప్రసాద్, పీఎస్‌వీ రామా రావు, శరత్‌కు మార్‌పాత్రో, పద్మకుమార్, మహేష్, ఏఓ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పెనుమత్సకు శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్సీ సురేష్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్డీ భానోజీరావు

నెల్లిమర్ల రూరల్: శాసనమండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి స్వగ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మొయిదలోని ఆయన స్వగృహానికి నెల్లిమర్ల నియోజకవర్గంతో పాటు గంట్యాడ, గుర్ల మండలాల నుంచి పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు బుధవారం తరలివచ్చి ఎమ్మెల్సీకు శుభాకాంక్షలు తెలిపారు. నెల్లిమర్ల ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్డీ భానోజీరావు, తదితరులు ఎమ్మెల్సీను మర్యాదపూర్వకంగా కలిశారు. స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులతో పాటు పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ, అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు. తండ్రి దివంగత మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు ఆశీస్సులతో నిత్యం ప్రజల్లోనే ఉంటానని చెప్పారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థినుల హవా



ఎంజేపీఏపీ గురుకుల బాలికల కళాశాల

నెల్లిమర్ల: స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటారు. సీనియర్ ఇంటర్‌లో 85 శాతం ఫలితాలతో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ కళాశాల నుంచి మొత్తం 105 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకాగా 89 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ నుంచి 32 మంది పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారు. ఎంపీసీ విద్యార్థిని బాకి సారిక 978 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. 977 మార్కులతో బాకి లిఖిత బైపీసీ టాపర్‌గా నిలిచింది. 25 మంది విద్యార్థులు 900 మార్కులు పైగా సాధించారు. జూనియర్ ఇంటర్‌లో 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు చెందిన 81 మంది పరీక్షలకు హాజరుకాగా 65 మంది ఉత్తీర్ణులయ్యారు.

సతివాడ ఆదర్శ విద్యార్థుల సత్తా

నెల్లిమర్ల రూరల్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రథమ ఇంటర్ సంవత్సరంలో మొత్తం 87 మంది విద్యార్థులకు గాను 56 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 86 మంది విద్యార్థులకు గాను 69 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో కొంచాడ ధనుషా 437 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో నందివర్ధన్ నాయుడు 980 మార్కులతో ఆదర్శ పాఠశాలకు టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ పద్మలత తెలిపారు.

మెరిసిన తీరప్రాంత విద్యార్థి

పూసపాటిరేగ: స్థానిక సూర్యోదయ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం (ఎంపీసీ) చదివిన తీరప్రాంత విద్యార్థి గనగళ్ల రాము 986 మార్కులు సాధించాడు. అలాగే కొరటాన గిరిజ 978, సింహాద్రి యశస్వి 973 మార్కులు, ద్వితీయ సంవత్సరం బైపీసీలో వాళ్లె దుర్గాప్రసాద్ 971 మార్కులు, పాడిపిరెడ్డి గణేష్‌కు 962 మార్కులు సాధించారు.

ఉపకరణాలు, కృత్రిమ అవయవాలకు ఎంపిక



మాట్లాడుతున్న సీఐ బాలసూర్యారావు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆవరణలో కోల్‌కత్తాకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ లోకోమోటారు డిజెబిలిటీ (ఎన్ఐఎల్‌డీ) ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు, కృత్రిమ అవయవాలకు గుర్తింపు శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీఐ బాలసూర్యారావు ప్రారంభించారు. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు చెందిన దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వీరిలో 484 మందిని వివిధ ఉపకరణాలకు గుర్తించినట్లు ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తెలిపారు. ఈ శిబిరం గురువారం కూడా కొనసాగనుందని చెప్పారు. సీఐ బాలసూర్యారావు మాట్లాడుతూ ఎందరో దివ్యాంగులకు కొత్త జీవితాలను గురుదేవా చారిటబుల్ ట్రస్టు ప్రసాదించ ద న్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో దివ్యాంగులకు ఉత్తమ సేవలందిస్తున్న ఏకైక సంస్థ గురుదేవ ట్రస్టు ఒక్కటే అని కొనియాడారు. ఎన్ఐఎల్‌డీ ప్రతినిధి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయసేకరణ



మాట్లాడుతున్న డీఆర్ఓ గణపతిరావు

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి రెవెన్యూలో సర్వే నంబర్ 187–2లో హెక్టార్ విస్తీర్ణంలో మెసర్స్ సత్య స్టోన్ క్రషర్ మైనింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన కార్వీ లీజు పునరుద్ధరణపై మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం ప్రజాభిప్రాయసేకరణ చేశారు. ఏడు గ్రామా ల పరిధిలో ఈ క్వారీ విస్తరించి ఉంది. ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ కార్వీ వల్ల తమకు ఎటువంటి ఇబ్బందులు లేవని, క్వారీలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని,యువతకు క్రీడా పరికరాలు అందించాలని కోరారు. విజయనగరం జిల్లా డీఆర్ఓ ఎం.గణపతిరావు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ సుదర్శన్, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, క్రషర్ పీఆర్ఓలు జె.రామారావు, సురేంద్ర, గరుడుబిల్లి, ఒంపల్లి, కొండకిండాం, అంబటివలస గ్రామాల నాయకులు బొద్దల చిన్నంనాయుడు, లండా నారాయణమ్మ, పెద్దమజ్జి గోపి, తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిందుసేద్యం లాభదాయకం



అలుగుబిల్లి గ్రామంలో డ్రిప్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

శృంగవరపుకోట/జామి: బిందు, తుంపర సేద్యం రైతులకు ఎంతో లాభదాయకమని, తక్కువ నీరు, తక్కువ విద్యుత్, తక్కువ కూలి ఖర్చుల తో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ చెప్పారు. ఎస్.కోట మండలంలోని అలుగుబిల్లి గ్రామంలో, జామి మండలం అన్నంరాజుపేట గ్రామంలో రైతులకు రాయితీపై అందించిన డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సన్న,చిన్నకారు రైతులకు 90శాతం రాయితీపై డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలను అందిస్తోందని చెప్పారు. రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జామి, సపోట,మామిడి,చెరకు, పామాయిల్, కొబ్బరి, కూరగాయల సాగుకు బిందు,తుంపర సేద్య పద్ధతులు అనువైనవి అన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ యూనిట్లు కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యానవనశాఖ అధికారి అనిత, ఎంఐఈ శ్రీనివాస్, వీఏఏలు శివ, జి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు..'

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని విజయనగరం ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని గుంకలాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల మంజూరు, చేసిన అభివృద్ధి పనులపై ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. లబ్ధిదారులకు నాలుగేళ్లలో మంజూరైన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్‌లను అందజేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిని డిప్యూటీ స్పీకర్‌కు లబ్ధిదారులు వివరించారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోలగట్ల కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాథరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నీతివంతమైన, సంక్షేమ పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ప్రజల కష్టసుఖాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉంటే, నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఉన్నారన్నారు. పారదర్శకంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, పార్టీ నాయకులు కాళ్ల సత్యనారాయణ, లెంక జగ్గునాయుడు, లెంక బాలాజీ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీలను అనుమతించాలి

విజయనగరం అర్బన్: తపాల శాఖ ఏజెంట్ల ద్వారా పోస్టల్ రికరింగ్ డిపాజిట్‌లను (ఆర్‌డీ) ఏప్రిల్ 2023 నుంచి నిలుపుదల చేయడం పట్ల పోస్టల్ ఆర్‌డీ డిపాజిట్ ఖాతాదారులు చిప్పాడ ప్రభుదాస్, దామెర సత్యనారాయణరావు, తదితరులు తీవ్ర నిరసన, ఆందోళన వ్యక్తం చేశారు. తపా శాఖ ఏజెంట్ల నుంచి పోస్టల్ రికరింగ్ డిపాజిట్లు అనుమతించాలని బుధవా రం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో ఏళ్ల కిందట పోస్టల్ ఆర్‌డీ ఏజెంట్ల వ్యవస్థను ఏర్పాటు చేసిందని దానిని కొనసాగించాలని కోరారు. అనంతరం ఆర్డీలను అనుమతించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

భోగాపురం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న భోగాపురం, నారుపేట, సుందరపేట, కారిచెరువు కొమ్ముగొల్లపేట, అప్పన్నపేట, సిమ్మపేట, తదితర గ్రామాల్లో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జ్ఞానేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి పది వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలి

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మితో మాట్లాడుతున్న వాసిరెడ్డి పద్మ

విజయనగరం ఫోర్ట్: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ సూచించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె మహిళా కమిషన్ సభ్యురాలు గద్దం ఉమ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావుతో కలిసి పైడితల్లి అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ, బాలికలు సోషల్ మీడియాకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విజయనగరం మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలో మహిళలకు అమలు చేస్తున్న పథకాలపై చర్చించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువత

విజయనగరం రూరల్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాకు 210 మంది అభ్యర్థులు హాజరుకాగా 140 మంది అర్హత పరీక్ష రాశారు. వీరిలో 30 మంది ఉత్తీర్ణత సాధించారని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నీలం గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐఓ మజ్జి సత్యనారాయణ, డీవీఈఓ ఆర్.సతీష్‌కుమార్, హెచ్‌సీఎల్ ప్రతినిధి యు.అనీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోలగట్ల శ్రావణి జన్మదిన వేడుకలు

● సేవా కార్యక్రమాలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఆలయాల అభివృద్ధికి నగదు సహాయాన్ని అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి కౌశిక్

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణికౌశిక్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో జరిగిన వేడుకల్లో శ్రావణి కేక్ కట్‌చేశారు. అనంతరం విజయనగరం పైడితల్లమ్మవారి దేవస్థానం, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం అర్చకులు ఆశీర్వచనలు అందజేశారు. నగరంలోని వివిధ డివిజన్ల కార్పొరేటర్లతో పాటు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు శ్రావణికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జమ్ములో ఉన్న బంగారమ్మ ఆలయానికి రూ.లక్ష, 11వ డివిజన్‌లో ఉన్న పైడితల్లమ్మ ఆలయానికి రూ.లక్ష, గాజులరేగలో ఉన్న సత్య ఆశ్రమానికి రూ.లక్ష , బుంగవీధిలో ఉన్న రామమందిరానికి రూ. లక్ష చొప్పున ఆయా ఆలయ కమిటీ ప్రతినిధులకు శ్రావణి అందజేశారు. అలాగే 17వ డివిజన్ పరిధిలో గల కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్‌లోని ఫుడ్‌బ్యాంక్‌లో పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు ఆధ్వర్యంలో పేదలకు భోజనం అందజేశారు. అదేవిధంగా కార్పొరేటర్ సయ్యద్ గౌస్ ఆధ్వర్యంలో నగరంలోని కస్పా ఉన్నత పాఠశాలలో 1200 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. 7వ డివిజన్‌లోని అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, పార్టీ నగర అధ్యక్షులు ఆశపు వేణు, మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్.బంగారునాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఎస్‌వీవీ శశిభార్గవి, కార్పొరేటర్లు కంటుభుక్త తవిటరాజు, ఆశపు సుజాత, అల్లు చాణక్య, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కాళ్ల సూరిబాబు, బోడసింగి ఈశ్వరరావు, పిలకా శ్రీనివాసరావు, చిన్న రవితేజ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

చీపురుపల్లి: పట్టణంలోని రుంకానవీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఇళ్లు దగ్ధమయ్యాయి. సర్వం కోల్పోయిన బాధితులకు వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలిచారు. బాధితుల ఇళ్ల నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఇప్పటికే నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుక, మెటల్ వంటి మెటీరియల్ సమకూర్చారు.

నేటి నుంచి మే3 వరకు గ్రామదేవతల పండగ



పండగ పోస్టర్లను విడుదల చేస్తున్న గ్రామపెద్దలు

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారం, కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీల్లో గ్రామదేవతల పండగను ఈనెల 27వ తేదీ నుంచి మే 3 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొసిరెడ్డి రమణ, మహేష్, లక్ష్మణ తెలిపారు. ఈ మేరకు పండగకు సంబంధించిన కరపత్రాలను బుధవారం రాత్రి విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 27న గురువారం రిక్షాకాలనీలో భూలోకమ్మవారికి, ఈనెల 30న ఆదివారం జి.అగ్రహారంలో కనకమహాలక్ష్మి అమ్మవారికి, మే2న జి.అగ్రహారంలో పైడితల్లి అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించనున్నట్లు చెప్పారు.మే 3న కనుమ పండగ ఉంటుందని తెలిపారు.